నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 16 జూన్ 2024 | NIZAMABAD

కామారెడ్డి కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి,జూన్ 15: కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న జితేశ్ వీ పాటిల్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆశిష్ సంగ్వాన్ స్వస్థలం హర్యానా రాష్ట్రంలోని భివాని. అమెరికాలోని జార్జియా టెక్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్ డిగ్రీ చేసిన అనంతరం 2015లో జరిగిన సర్వీసెస్ పరీక్షలో 12వ ర్యాంకు సాధించారు. 2023 అక్టోబర్ నుంచి నిర్మల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సంగ్వాన్‌ను కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ఆయన భార్య కూడా 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ క్రాంతి వల్లూరు. ప్రస్తుతం ఈమె సంగారెడ్డి కలెక్టర్‌గా పనిచేస్తున్నారు.

SRI VIJAYA SAI DAY & RESIDENTIAL HIGH SCHOOL (VI TO X E/M)
GUNJ ROAD, BODHAN, CELL: 9490167397, 9490167396
మా హైస్కూల్ ప్రత్యేకతలు
మా సొంత మెటీరియల్‌తో IIT, NEET ఫౌండేషన్ & Olympiad తరగతుల నిర్వహణ
పటిష్టమైన విద్యా ప్రణాళికతో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన
నీతి ఆయోగ్ సంస్థ ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ లాబ్ ఏర్పాటు
సైన్స్ లాబ్, కంప్యూటర్ లాబ్‌లతో పాటు అతి పెద్ద లైబ్రరీ
ప్రతి యేటా రాష్ట్ర స్థాయి ర్యాంకులతో అత్యుత్తమ ఫలితాలు
బాల బాలికలకు వేర్వేరుగా ప్రత్యేక హాస్టల్ వసతి
అడ్మిషన్లు జరుగుచున్నవి
VIJAYA SAI PRIMARY SCHOOL (LKG to V E/M)
అడ్మిషన్లకు సంప్రదించండి. సెల్: 9908748490, 9491305316 (డే స్కాలర్స్‌కు మాత్రమే)

స్టేట్ 1 ఫస్ట్
KASAM ANUTHA Sr. MPC 993/1000
JUKLE POOJA Sr. BIPC 990/1000
BIPC-II 989/1000 QURRATUL AIN
MPC-II 987/1000 I. SWETHA
MPC-I 467/470 CHIKKELA POOJITHA
BIPC-I 436/440 SALMA TABBASUM
CEC-I 491/500 AMEENA BEGUM
MEC-I 481/500 G. GANESH
USHODAYA
JEE - NEET ACADEMY
JUNIOR COLLEGE
MAHILA JUNIOR COLLEGE
COURSES: MPC, BPC, MEC, CEC
SARASWATHI NAGAR, BODHAN, NIZAMABAD CELL : 9441071654



సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న తిమ్మక్‌పల్లి రైతులు

కరెంటు కోసం రోడ్డెక్కిన రైతన్న

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా
మూడు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టిన అన్నదాతలు

కామారెడ్డి,జూన్ 15: పొలాల వద్ద మోటర్లకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం వహించడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలల క్రితం డీడీలు కట్టినా పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద తిమ్మక్‌పల్లి గ్రామ రైతులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మూడు నెలల క్రితం వ్యవసాయ భూముల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టినప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్లను కేటాయించలేదన్నారు.గద్దెలు కట్టారు తప్పా.. ట్రాన్స్‌ఫార్మర్లు కేటాయించలేదని అన్నారు. వర్షాలు కురిస్తే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు ఇబ్బందులవుతాయని, తమ గ్రామంలోనూ విద్యుత్ సమస్య తీవ్రంగా ఉన్నదని అన్నారు. పొలాలకు కరెంట్ లేకపోవడంతో వరి తుకం ఎండిపోయే పరిస్థితి నెలకొన్నదని వివరించారు. ఏ అధికారి వద్దకు వెళ్లినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని అన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో కొంతమంది ఇప్పటి వరకు తుకం వేయలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి రైతులకు కష్టాలు అధికమయ్యాయని ఆరోపించారు. విద్యుత్ అధికారులు వచ్చే వరకు ధర్నా విరమించేది లేదని మెదక్-కామారెడ్డి ప్రధాన రహదారిపై సుమారు రెండు గంటలకుపైగా బైటాయించి రైతులు నిరసన తెలిపారు. ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రైతులను సముదాయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

రైతులను సముదాయిస్తున్న పోలీసులు

డీడీలు కట్టి మూడు నెలలు అయ్యింది..

వ్యవసాయ భూముల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టి మూడు నెలలు అవుతుంది. అయినా కూడా అధికారులు ఇప్పటి వరకు స్పందించలేదు. కనీసం ఇక్కడికి వచ్చి మా సమస్యలను పరిష్కరించలేదు. మాకు పరిహారం చెల్లించాలి.

- రాజయ్య,రైతు, తిమ్మక్‌పల్లి

తుకం ఎండిపోతున్నది..

మూడు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీ కట్టినప్పటికీ అధికారులు స్పందించడం లేదు. కరెంట్ లేకపోవడంతో వరి తుకం ఎండిపోయే పరిస్థితి ఉన్నది. ఇకనైనా అధికారులు స్పందించి మా సమస్యలు పరిష్కరించాలి.

-నారాయణ, రైతు, తిమ్మక్‌పల్లి

ఏ నాయకుడూ పట్టించుకోవడం లేదు

బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకునే వారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏ నాయకుడూ మా బాధను పట్టించుకోవడం లేదు.ట్రాన్స్‌ఫార్మర్లు లేక చాలా మంది రైతులు ఇబ్బందిపడుతున్నారు.అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదు.

-విజయ్‌కుమార్, తిమ్మక్‌పల్లి

నవీపేట మేకల సంత @ రూ.4కోట్లు

నవీపేట, జూన్ 15 : నిజామాబాద్ జిల్లా నవీపేట మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మేకల సంతలో రికార్డు స్థాయిలో జీవాల క్రయవిక్రయాలు జరిగాయి. బక్రీద్ పండుగను పురస్కరించుకొని తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, హర్యానా, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వ్యాపారులు, ప్రజలు జీవాల కొనుగోలుకు పోటీపడ్డారు. ఒక్కరోజే రూ.4కోట్లకు పైగా మేకలు, గొర్రెల క్రయవిక్రయాలు జరిగినట్లు పంచాయతీ అధికారులు పేర్కొన్నారు. ఒక్కో మేక పొట్టేలు రూ. 15 వేల నుంచి రూ.18వేల వరకు ధర పలికింది. కొనుగోలు, విక్రయదారులతో నవీపేట మొత్తం సందడి వాతావరణం నెలకొన్నది.

సాటాపూర్‌లో సందడి

రెంజల్, జూన్ 15: మండలంలోని సాటాపూర్ పశువుల సంతలో శనివారం సందడి వాతావరణం నెలకొన్నది. 17న బక్రీద్ సందర్భంగా పశువుల కొనుగోళ్లకు డిమాండ్ పెరిగింది. సంతకు ఆశించిన స్థాయిలో కంకలు రాలేదు. మహారాష్ట్రలోని నాందెడ్ పట్టణానికి చెందిన వ్యాపారి రూ.లక్షా80వేలకు ఓ కంకను కొనుగోలు చేశాడు. పశువుల కొనుగోళ్లకు అనుమతిపత్రాలు తప్పనిసరి కావడంతో వ్యాపారులు గ్రామ పంచాయతీ వద్ద పెద్ద ఎత్తున బారులు తీరారు. బోధన్ రూరల్ సీఐ నరేశ్‌కుమార్, ఎస్సై సాయన్న బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొట్టి చంపారు..

- భర్తను చంపిన భార్య, కుమారుడు, మామ?
- సాతెల్లిలో దారుణం

ఎల్లారెడ్డి, జూన్ 15: కుటుంబ తగాదాలతో ఒకరు దారుణహత్యకు గురయ్యారు. ఆస్తి కోసం సొంత కుటుంబీకులే హత్యకు పాల్పడిన ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం సాతెల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. సాతెల్లికి చెందిన కుర్మ దుర్గయ్య (35)కు అదే గ్రామానికి చెందిన లక్ష్మితో కొన్నేండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. అయితే, దంపతుల మధ్య తరచూ తగాదాలు జరుగుతుండడంతో పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీ కూడా జరిగింది. చాలా రోజుల నుంచి భార్యాభర్తలు విడివిడిగానే ఉంటున్నారు. పెద్దల సూచన మేరకు ఉన్న నాలుగు ఎకరాల భూమిలోనుంచి ఎకరం కుమారుడికి ఇవ్వాలని చెప్పగా, దుర్గయ్య సరే అన్నాడు. అయితే, ఉన్న నాలుగు ఎకరాలు భార్య ఆధీనంలోకి తీసుకుని సాగు చేసుకుంటున్నది. తనకు భూమి లేకపోతే ఎలా బతికేదని భావించిన దుర్గయ్య మూడు రోజుల క్రితం పొలం వద్దకు వెళ్లి ఎకరం భూమిని దున్నాడు. శనివారం ఉదయం మరోమారు పొలం వద్దకు వెళ్లగా, భార్య లక్ష్మి, కుమారుడితో పాటు మామ సాయిలు గొడవకు దిగారు. ముగ్గురు కలిసి అతడ్ని తీవ్రంగా చితకబాదారు. అనంతరం అతడ్ని ఇంటికి తీసుకొచ్చి ఇంట్లో పడేసి గడియ పెట్టి వెళ్లిపోయారు. ఇది గమనించిన స్థానికులు 100, 108కు కాల్ చేసి సమాచారమిచ్చారు. దీంతో 108 సిబ్బంది వచ్చి దుర్గయ్యను ఎల్లారెడ్డి దవాఖానకు తరలించగా, పరిశీలించిన వైద్యులు కామారెడ్డి దవాఖానకు తీసుకెళ్లాలని సూచించారు. పరిస్థితి విషమించడంతో కామారెడ్డికి వెళ్లేలోపే అతడు మృతి చెందాడు. భార్య లక్ష్మి, కుమారుడు, మామ కుర్మ సాయిలు కొట్టడంతోనే తన తమ్ముడు మృతి చెందాడని దుర్గయ్య సోదరుడు కాశయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

భూమి కోసం ప్రాణం తీసిన వైనం

టీయూ ఇన్‌చార్జి వీసీగా సందీప్‌కుమార్ సుల్తానియా కొనసాగింపు

డిచ్‌పల్లి, జూన్ 15: తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్‌గా సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ సందీప్‌కుమార్ సుల్తానియాను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు 2021 మే 21న అప్పటి ప్రభుత్వం రెగ్యులర్ వీసీలను నియమించింది. 2024 మే 21తో వారి పదవీకాలం ముగిసింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండడం, కొత్త వీసీల నియామక ప్రక్రియ ఇంకా పూర్తికాకపోవడంతో ప్రభుత్వం 10 యూనివర్సిటీలకు సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్లను జూన్ 15 వరకు ఇన్‌చార్జి వీసీలుగా నియమించింది. అయితే ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ శాశ్వత వీసీల నియామక ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ఇన్‌చార్జి వీసీల పదవీకాలాన్ని తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అటవీశాఖ అధికారులు

రక్షణ కోసం ఆయుధాలివ్వండి

- కాల్పోల్ ఘటనపై అటవీశాఖ ఉద్యోగుల నిరసన
- జిల్లా కేంద్రంలో సంఘీభావ ర్యాలీ

వినాయక్‌నగర్, జూన్15: తమ ప్రాణాలకు రక్షణ ఉంటేనే అటవీ భూములను రక్షించగలుగుతామని, ప్రభుత్వం వెంటనే తమ రక్షణ కోసం ఆయుధాలివ్వాలని అటవీశాఖ అధికారులు కోరారు. మోపాల్ మండలం కాల్పోల్ అటవీ ప్రాంతంలో ఫారెస్టు అధికారులు, సిబ్బందిపై దాడికి నిరసనగా శనివారం జిల్లా కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అటవీ ప్రాంతాలను కాపాడేందుకు తాము రాత్రింబవళ్లు కష్టపడి పనిచేస్తున్నామన్నారు. అటవీ భూములను కబ్జా చేసేందుకు యత్నించే వారిని అడ్డుకుంటే తమపైనే దాడులకు పాల్పడుతున్నారని, తమ ప్రాణాలకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో ఉండే కొంతమంది నాయకులు రెచ్చగొట్టడంతోనే కాల్పోల్ లాంటి దాడులు జరుగుతున్నాయని తెలిపారు. దాడులు చేసే వారిని అడ్డుకునేందుకు తమ వద్ద ఆయుధాలు లేవని, మళ్లీ ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. గతంలో ఇందల్వాయి ఏరియాలో ఫారెస్టు అధికారిని హత్య చేసిన ఘటనను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ర్యాలీ అనంతరం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో పాటు అదనపు డీసీపీని కలిసి తమ రక్షణ కోసం అవసరమైనచర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో సుధాకర్, ఎఫ్ఆర్వోలు రవిమోహన్‌భట్, పద్మారావు, శ్రీనివాస్, రవీందర్, ఎన్‌బీ నాయక్, డీఆర్వో సుధాకర్‌రావుతోపాటు సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా యువకుడికి కేంద్ర సాహిత్య అకాడమీ యువజన పురస్కారం

రమేశ్ కార్తీక్ నాయక్

ఖలీల్‌వాడి, జూన్ 15 : నిజామాబాద్ జిల్లాజక్రాన్‌పల్లి తండాకు చెందిన యువ రచయిత, కవి రమేశ్ కార్తీక్‌నాయక్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ యువజన పురస్కారం దక్కింది. తాను రాసిన తొలి కథా సంపుటి 'దావ్లో' పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ యువజన సాహిత్య పురస్కారం-2024ను ప్రకటించారు. ఆయనకు పురస్కారం దక్కడంపై హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ శనివారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 26 ఏండ్ల చిన్న వయస్సులోనే పురస్కారం అందుకున్న ఘనత రమేశ్ కార్తీక్‌నాయక్‌కు దక్కిందని పేర్కొన్నారు. బంజారాల జీవనచిత్రాలను సహజంగా, తన కథల్లో ఆకర్షణీయంగా చెప్పారని కొనియాడారు. ఆయన ప్రతిభను గుర్తించి 2023లో హరిదా రచయితల సంఘం.. హరిదా యువ సాహిత్య పురస్కారాన్ని బహూకరించి గౌరవించినట్లు గుర్తుచేశారు.

బెట్టింగ్‌కు చేసిన అప్పు తీర్చేందుకే వృద్ధురాలి హత్య

బాన్సువాడ, జూన్ 15 : ఆన్‌లైన్ బెట్టింగులు కోసం చేసిన అప్పులు తీర్చడానికే వృద్ధురాలిని సాయిబాబా అనే యువకుడు హత్య చేశాడని పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో శనివారం పట్టణ సీఐ వివరాలను వెల్లడించారు. తాడ్కోల్ శివారులో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ఉప్పరి సాయవ్వ (72) ఒంటరిగా జీవిస్తున్నది. వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు నగలను చూసి అప్పులు తీరుతాయని సాయిబాబా ఈ ఘాతుకానికి పాల్పడినట్లు నిర్ధారించామని తెలిపారు. శుక్రవారం తాడ్కోల్ చౌరస్తా వద్ద నిందితుడు సాయిబాబాను అదుపులోకి తీసుకొని, తమదైన శైలిలో విచారించామన్నారు. నిందితుడి నుంచి కత్తి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. శనివారం నిందితుడిని కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ సత్యనారాయణగౌడ్ అభినందించారు.